ముంచిన మిచాంగ్..

రెస్క్యూబోట్ సిద్ధం..



సత్తుపల్లిలో సిద్ధమైన బోటు

సత్తుపల్లిటౌన్: భారీ వర్షాలకు సహాయక చర్యలు చేపట్టేందుకు రెండు ఇంప్లాటిడ్ రెస్క్యూ బోట్‌ను అధికారులు సిద్ధం చేశారు. కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక చొరవతో ఒక్కొక్కటి రూ.6 లక్షలతో సత్తుపల్లి అధికారులు కొనుగోలు చేశారు. ఇవి నడిపేందుకు 20 మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వగా, ఒక్కో బోట్‌లో ఎనిమిది మందిని తీసుకెళ్లవచ్చని తహసీల్దార్ యోగీశ్వర్‌రావు తెలిపారు.

క్లుప్తంగా

నేత్రదానం



రాఘవులు (ఫైల్)

కారేపల్లి: కారేపల్లి బీసీ కాలనీకి చెందిన రావుల రాఘవులు(38) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈమేరకు ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో ఖమ్మం నేత్రనిధి బాధ్యులు సేకరించారు. పాత సామగ్రి వ్యాపారం చేసే రాఘవులు సోమవారం ఒక్కసారిగా అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఆయనకు భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అవయవదానం అత్యున్నతమైనది



అవగాహన కల్పిస్తున్న సంఘం సభ్యులు

కారేపల్లి: అన్ని దానాల్లో కల్లా అవయవ దానం అత్యున్నతమైనదని అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల అశోక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తకమలాపురం గ్రామంలో మచ్చ రామయ్య ఆధ్వర్యంలో జరిగిన అవయవ దానం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతదేహాన్ని కాల్చటం, పూడ్చటంతో మరొకరికి ప్రాణం ఇచ్చే అవయవాలు బూడిదపాలు, మట్టి పాలు అవుతున్నాయన్నారు. అవయవ దానం చేయటంతో చిరంజీవులుగా మిగిలిపోతారన్నారు. భారతదేశంలో 12లక్షల మంది అంధులు ఇంతవరకు ప్రపంచాన్ని చూడలేక, నేత్రదాతల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారులు ఆడెపు రాజేంద్రప్రసాద్, చాగంటి కిషన్, వడ్డే హనుమంతరావు, కొచ్చర్ల వినీత్, ఆవుల వీరయ్య, పృథ్వీరాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం జరిగితే సమాచారం ఇవ్వాలి

ఎర్రుపాలెం: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో ప్రజలకు నష్టం జరిగినా, ఇళ్లు, రోడ్లు దెబ్బతిన్నా ప్రజలు తక్షణమే సమీపంలోని అధికారులకు సోషల్ మీడియా ద్వారా సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ ఉషాశారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ తీవ్రతను ఎస్సై సురేష్, ఎంపీడీవో శ్రీనివాసరావులతో కలిసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. బాధితులు తగిన సమాచారాన్ని 9000957011, 9705858970, 9281482733 నంబర్లకు తెలపాలని పేర్కొన్నారు.

అధికారులందరు అందుబాటులో ఉండండి..

సత్తుపల్లి: తుపాన్ ఉధృతంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులందరూ అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి నుంచి శాసనసభకు ఎన్నికైన డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. తుపాన్ ప్రభావంతో రైతులు పంట నష్టం జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎక్కడైనా ఆస్తి, పంట నష్టం ఏర్పడితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. నష్టం జరిగిన ప్రాంతంలోని రైతులు, ప్రజలు తన నంబర్‌కు ఫొటోలు పంపాలన్నారు. ఇప్పటికే తుపాన్‌కు సంబంధించిన చర్యలపై కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. తుపాన్ ప్రభావం తగ్గేవరకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు.



వైరారూరల్: తడిచిన ధాన్యపు రాశులు



వైరారూరల్: నేలకొరిగిన వరి



మధిర: బుచ్చిరెడ్డిపాలెంలో..



కారేపల్లిలో..

అకాల వర్షంతో అపారనష్టం..

- నేలకొరిగిన వరి.. తడిచిన పత్తి, ధాన్యం
- ఆవేదనలో అన్నదాత
- ఎడతెరిపిలేని వానతో స్తంభించిన జన జీవనం



చెట్ల నుంచి కారుతున్న పత్తి



కొణిజర్ల: మల్లుపల్లిలో నేలకొరిగిన వరి





తల్లాడ: పట్టాలపై నిలిచిన వర్షపు నీరు

మధిర: మిచాంగ్ తుపాన్ రైతులను నిండా ముంచింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం అస్తవ్యస్తమైంది. ఈ మేరకు మండలంలో సాగుచేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సిరిపురం, వంగవీడు, బుచ్చిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో సాగుచేసిన వరి కోత దశలో ఉంది. బలమైన ఈదురు గాలులతో వర్షం కురుస్తుండడం వల్ల వరి పైరు నేలకొరిగింది. మధిర మండలంలో మంగళవారం 50 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మధిర పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద ప్రవహిస్తుండడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దుకాణాలు కూడా తెరుచుకోలేదు. జనసంచారం లేక పట్టణంలోని రోడ్లు అన్నీ వెలవెలబోయాయి.

వైరారూరల్: మండల వ్యాప్తంగాఉదయం నుండి కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. దాచాపురం, గరికపాడు, నారపునేనిపల్లి, ఖానాపురం, పూసలపాడు, పుణ్యపురం, సిరిపురం, విప్పలమడక గ్రామాలలోని రైతులు తమ వరి పైర్లను కోయించి తేమ శాతం కోసం ధాన్యం రాశులను రహదారుల మీద ఆరబెట్టి టార్పాలిన్ పట్టాలు కప్పి జాగ్రత్తలు వహించినప్పటికీ పట్టాల మీద వర్షాపు నీరు చేరి ధాన్యం రాశులు తడిచాయి.

సత్తుపల్లిటౌన్: మండలంలో పలు గ్రామాలలో కోత దశలో ఉన్న వరి పంట వర్షాలకు దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయ్యగారిపేటలో ధాన్యం రాసులు తడవకుండా రైతులు పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. రేజర్ల, గంగారం సొసైటీల పరిధిలోని వెయ్యి క్వింటాళ్ల చొప్పున ధాన్యం కొనుగోలు చేయగా తడవకుండా పట్టాలు కప్పారు.

ఏన్కూరు: మండలంలో సోమవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పంటనష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి నెలకొరిగింది. కూలీలు కొరతతో పత్తి తీయకపోవడంతో పత్తి తడిసిపోయింది. తడిసిన పత్తి రంగుమారి గిట్టుబాటు ధర రాదని రైతులు అవేదన పడుతున్నారు.

ఎర్రుపాలెం: మండలంలో 47.7 మి.మీ వర్షపాతం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో వీచిన గాలులతో వేలాది ఎకరాల్లో కోతకు వచ్చిన వరి చేలు నేలమట్టమయ్యాయి. జోరు వర్షంతో జన జీవనం పూర్తిగా స్థంభించింది. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కొణిజర్ల: మండలంలో కొణిజర్ల, మల్లుపల్లి, లాలాపురం, గుండ్రాతిమడుగు, గుబ్బగుర్తి తదితర గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న వరి పంట ఈదురు గాలులకు నేల కొరిగింది. మరో రెండు రోజుల పాటు వర్షం ఉంటే ఈ పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిస్తే మిరప చెట్లు నేలకొరిగా కాయలు పాడైపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

తడిసిన 20 వేల బస్తాల ధాన్యం..

కల్లూరు/ కలూరురూరల్: కల్లూరులో మంగళవారం 9.5 మిమీ వర్షపాతం నమోదు అయ్యింది. మండలంలో 30 వేల ఎకరాలలో వరిని వారం రోజులుగా వరికోత మిషన్లతో కోయిస్తున్నారు. కల్లూరు, పుల్లయ్యబంజర్ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన సుమారు 20 వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. రోడ్ల పక్కన పొలాల వెంట ఎక్కడ పడితే అక్కడ రైతులు ధాన్యం ఆరపోసి పట్టాలు కప్పి ఉంచారు. ప్రైవేట్ వ్యాపారులు సైతం సోమవారం నుంచి వర్షం వస్తే ఇబ్బంది అవుతుందని కాటాలు వేయడం ఆపేశారు. మండలంలో సుమారు 5 వేల ఎకరాలలో పత్తి , 2 వేల ఎకరాలలో మిర్చి సాగు చేయగా వర్షం దెబ్బకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. .

ముదిగొండ: మండలంలో 7.6 మీ.మీ వర్షపాతం నమోదు అయిందని అధికారులు తెలిపారు. ఇదే వర్ష ప్రభావం తీవ్రంగా ఉంటే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. పొలాల వద్ద రైతులు ఉరుములు, మెరుపులకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కారేపల్లి: మండలంలోని కారేపల్లి పెద్ద చెరువు, పోకాలకుంట, కంబాలకుంట, సుబ్బయ్యకుంట, ఎర్రకుంట మాధారం చెరువు, తొడితలగడూడెం చెరువు, గాదెపాడు భూపతిరాయుని చెరువు, అప్పాయిగూడెం చెరువు, బొడ్రాసికుంట చెరువు, పేరుపల్లి పెద్ద చెరువు, గేటుకారేపల్లి చెరువు, కమలాపురం చెరువు, విశ్వనాథపల్లి బూరుగుకుంట చెరువు ఆయకట్టుల కింద వేసిన వరి పొలాలు కోతదశకు వచ్చాయి. మరికొంత మంది కోతలు కోసి వరి పన్నలను పొలాల్లోనే ఉంచగా, మరికొంతమంది గూడు వేయటంతో తుఫాన్ కారణంగా నష్టవాటిల్లే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లాడ: మండలంలోని తల్లాడ, బిల్లుపాడు, వెంగన్నపేట, అన్నారుగూడెం, పినపాక, నూతనకల్, మిట్టపల్లి, రంగంబంజర, ముద్దునూరు, కుర్నవల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, గోడౌన్ల వద్ద ఆరబోసి ఉంచిన ధాన్యం తడిసి పోయింది. వందలాది ఎకరాల్లోని పంటకు నష్టం జరిగింది.

బోనకల్: మండల వ్యాప్తంగా పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. వరి కోత కోసి పనలు పొలంపై ఉండడంతో తడిచాయి. పత్తి తడవడంతో మెలకలు వచ్చే అవకాశం ఉంది. గోవిందాపురం గ్రామంలో బారీ వృక్షం నేలకొరగడంతో రాకపోకలు స్తంభించాయి.



కలూరురూరల్: ధాన్యంపై కప్పిన పట్టాలు



సత్తుపల్లిటౌన్: పట్టాలు కప్పిన రైతులు



బోనకల్: గోవిందాపురంలో నేలకొరిగిన వృక్షం



కల్లూరు: కల్లూరు శివాలయం ఆవరణలో ఆరబోసిన ధాన్యం

కొట్టుకుపోతున్న చప్టాలు..



చిరుమర్రి చప్టా వరదకు కొట్టుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు(ఫైల్)

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



పమ్మి వద్ద అధికారులు పర్యవేక్షణ(ఫైల్)

ముదిగొండ: మండలంలో పలు చోట్ల లోలెవల్ చప్టాలు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిరుమర్రి-వనంవారికిష్టాపురం, అమ్మపేట, వనంవారికిష్టాపురం, కమలాపురం-గంధసిరి, బాణాపురం-వల్లభి, పెద్దమండవ-మల్లారం, మేడేపల్లి-కట్టకూరు, అమ్మపేట, వల్లాపురంలలో లోలెవల్ చప్టా వద్ద తరచూ కురుస్తున్న వర్షాలకు మునిగిపోయి రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డు సైతం కొట్టుకుపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చిరుమర్రి వద్ద పెద్ద గండిపడి ప్రయాణికులకు ప్రమాదాలకు నిలయంగా మారింది, వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు దాటుతున్న సమయంలో అధికారులను, ప్రజాప్రతినిధులను గుర్తు చేసుకుంటున్నారు. ఈ సమస్యల గురించి పట్టించుకోనే నాథుడే లేరా అని వాపోతున్నారు. ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ చప్టాలపై ప్రజలు ఖమ్మం-వల్లభి, ముదిగొండ నుంచి దాదాపు 20 గ్రామాల వారు నిత్యం రాకపోకలు ఈ రహదారులపైనే ఎక్కువగా కొనసాగిస్తుంటారు. వరద ఉధృతికి రోడ్డు కొట్టుకుపోవడంతో గుంతలు పడి పూర్తి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. చప్టాల వద్దకు రాగానే ఆటోలు, ద్విచక్రవాహనాలు దిగి నడిపించుకుంటూ జాగ్రత్తగా వెళ్లాలి లేదంటే ఆదమరిస్తే అంతే సంగతి. ఇదిలా ఉండగా తుఫాను కారణంగా ప్రజలు సమీప వాగులు, చెరువులు వద్దకు వెళ్లొదని గ్రామాల్లో మైకుల ద్వారా అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. అప్రమత్తం చేస్తున్నారే తప్పా సమస్య పరిష్కరించట్లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లోలెవల్ చప్టాలపై వంతెనలు నిర్మించాలని, గుంతలు పూడ్చి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



వానలకు చప్టాలు పొంగినప్పుడల్లా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చిరుమర్రి చప్టా కొట్టుపోయిన గండిని పూడ్చక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి లోలెవల్ చప్టాలను ఎత్తుగా నిర్మించాలి.

- బిచ్చాల భిక్షం, ఎంపీటీసీ, వల్లభి

అప్రమత్తం చేస్తున్నాం..



వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని గ్రామాలలో పంచాయతీ సిబ్బంది ద్వారా మైక్ ద్వారా సమాచారం ఇవ్వాలని చెప్పాం. చప్టాలపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచిస్తున్నాం.

-ఎస్సై నరేష్, ముదిగొండ

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



సత్తుపల్లి: మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అప్పారావు



వైరారూరల్: వరిపంటను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు



కల్లూరు రూరల్: మాట్లాడుతున్న సాంబశివుడు

సత్తుపల్లి: తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ అప్పారావు, కల్లూరు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి అన్నారు. సత్తుపల్లి మండలం పాకలగూడెం, బుగ్గపాడు, చెరుకుపల్లి, రుద్రాక్షపల్లి, కిష్టారం, యాతాలకుంట ప్రాంతాలలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని సూచించారు. లోలెవల్ వాటర్ బ్రిడ్జిలు దాటవద్దని, వర్షాలు విపరీతంగా ఉంటే పునరావాస కేంద్రాలకు పంపిస్తామన్నారు. దామిని యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే అర్ధగంటే ముందే పిడుగుపడే ప్రమాదం తెలుస్తుందన్నారు. ఎక్కడైన విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయని గమనిస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. వీరి వెంట ఎంపీడీఓ జయరాం, ఆర్‌ఐలు నరేష్, జానిమియా ఉన్నారు.

వైరారూరల్: మిచౌంగ్ తుపాన్ పట్ల రైతులు అప్రమత్తంగా వ్యవహరించి వరి పైర్లకు నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ బాబురావు, ఏఓ ఎస్. పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని దాచాపురం గ్రామంలో మంగళవారం కల్లాలలోని ధాన్యం రాశులు, వరి పైర్లను సందర్శించి పరిశీలించిన సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. ఈదురు గాలులు, వర్షానికి నీరు పొలాల్లో నిల్వ ఉండకుండా ఉండేందుకు పాయాలు తీసి నీరు పొలం నుండి బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద నిలబడడం, మొబైల్ ఫోన్ మాట్లాడడం, ఎలక్ట్రికల్ వస్తువులకు ఛార్జింగ్ పెట్టడం, పొలాల్లో విద్యుత్ మోటార్లు ఆన్ చేయడం వంటి పనులు చేయొద్దన్నారు. ఏఈఓ సైదులు, రైతులు పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్లూరు తహసీల్దార్ సాంబశివుడు కోరారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకుంటున్నామని, జిలాల్లో గంటకు వంద కిలోమీటర్ల గాలులు వీచే అవకాశముందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీసు, నీటి పారుదల, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

సత్తుపల్లి: సత్తుపల్లిలోని కిష్టారం ఓసీలో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ ఆధ్వర్యంలో మంగళవారం సింగరేణి కార్మికులు సంఘంలో చేరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపులో భాగమైన కార్మికులకు జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికుల సంపూర్ణ మద్దతుతో ఐఎన్‌టీయూసీ మరింత ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావి నాగేశ్వరరావు, ఎం. బాలకృష్ణ, రామారావు, ఫిట్ సెక్రటరీ తిరుమలరావు పాల్గొన్నారు.



సంఘంలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

ప్రమాదకరంగా కల్వర్టు...



చింతలచెరువు వద్ద కల్వర్టుకు పడ్డ రంధ్రం

కొణిజర్ల: మండలకేంద్రం కొణిజర్ల నుంచి మల్లుపల్లి వెళ్లే రోడ్డులో చింతల చెర్వు వద్ద కల్వర్టుకు రంధ్రం పడి ప్రమాదకరంగా తయారైంది. కొణిజర్లకు మల్లుపల్లి, రామనరసయ్యనగర్, సాలెబంజర, తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డు మీదనే ప్రయాణం చేస్తుంటారు. రామనరసయ్య నగర్, మల్లుపల్లి నుంచి సుమారు 100 మందికి పైగా విద్యార్థులు కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వస్తుంటారు. ఈ కల్వర్టు రంధ్రం మరింత పెరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు పడ్డ రంధ్రం పెరిగిందని, తెలియని ద్విచక్రవాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారని మల్లుపల్లి వాసులు తెలిపారు. రాత్రివేళలో ఎవరైనా తెలియని వ్యక్తులు వస్తే కచ్చితంగా ఈ రంధ్రంలో పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.